# చిగురు

తుర్రమిల్లి విజయలక్ష్మి

“ఈ పిల్ల వెధవలతో ఛస్తున్నా ననుకోవే అక్కా …! ఒక్క క్షణం ఊపి రాడనీయడం లేదు…అవతల ఉద్యోగం ఒహటేడ్చింది…

ఎందుకు చెప్తావులే … నా బాధ …!” పద్మ భృకుటి ముడిచి విసుగ్గా చెప్తూ – “చదవరా వెధవా!” అని కొడుకుని గదిమి – “వీడికి మొన్న పరీక్షల్లో సున్నొచ్చిందే అక్కా … టీచర్ చాలా పూర్‌గా వున్నాడండీ” … అంటే చచ్చే సిగ్గేసిందనుకో! అంటున్న పద్మను నవ్వుతూ చూసింది విశాల. సున్న విలువ తెలియని పద్మ కొడుకు గొప్పగా నవ్వుతూ “అవును … పెద్దమ్మా … సున్నొచ్చింది నాకు …” అంటున్నాడు. నాలుగేళ్ళయినా లేని పసివాడు చదువులో వెనకపడి పోతున్నాడన్న చెల్లెలి ఆరాటం విశాలకు కాస్త నవ్వు తెప్పించింది.

“బబ్లూ గాడి గురించి నాకంత దిగుల్లేదు … చెప్పింది. బాగానే గ్రాస్ప్ చేస్తాడు … ఈ వెధవే … ఇంకా స్కూలుకి వెళ్ళడం కూడా అలవాటు కాలేదు. క్లాస్‌లో కూర్చొని నిద్ర పోతాట్ట…” అక్కతో మాట్లాడుతూనే పిల్లాడి చేత అక్షరాలు దిద్దిస్తోంది పద్మ. వాడు క్షణం కుదురుగా కూర్చోలేకపోతున్నాడు. దృష్టంతా బయట ఆడుకొంటున్న పిల్లల మీదే…

“పాపం!” అంది విశాల ఆ పసివాడి అవస్థ చూస్తూ.

“ఏం పాపమో … నా పాపం పండిపోతోంది… ఈ చింటూ గాడు సరిగా తిండి తినడు … వట్టి అల్లరి వెధవ … పనివాళ్ళకి వదిలి పెడితే వీళ్ళేం బాగుపడతారు చెప్పు … ఆయనసలు పట్టించుకోరు పిల్లల గురించి …”

ముగ్గురు ముత్యాల వంటి మగ పిల్లలతో పద్మ పడుతున్న అవస్థ మురిపెంగా, వింతగా వింటూ సానుభూతితో అర్థం చేసుకుంది అక్క విశాల.

“నీ పని నయమనుకోవే … ఏ బాధా లేదు…” పెద్ద పిల్లాడిచేత రైమ్స్ బైహార్ట్ చేయిస్తూనే అంటోంది పద్మ.

చెల్లెలు, పిల్లలతో సరదాగా నాలుగు రోజులు గడిపి వెళ్ళాలని వచ్చింది విశాల. పిల్లల ముద్దు ముచ్చట్లతో, చెల్లెలి ప్రేమాభిమానాలతో రోజులు క్షణాల్లో గడిచిపోయాయి.

“పోనీ వీణ్ని నాతో పంపించవే … అక్కడా మంచి ఇంగ్లీష్ మీడియం కాన్వెంటుంది … పైన నేను ఖాళీయే కదా … చదువు – సంధ్య స్వయంగా చూసుకోవచ్చు…” అనకుండా వుండలేకపోయింది విశాల. ఈ ప్రపంచంలోని ముద్దులన్నీ మూటగట్టినట్లున్న చెల్లి పిల్లలంటే విశాలకెంతో మక్కువ. పైగా పద్మ ఇంటా, బయటా బాధ్యతలతో సతమతమై పోతోంది. ఎంతైనా పనివాళ్ళ పెంపకం ఏం తృప్తిగా వుంటుంది – “అమ్మో…! ఇంకేమన్నా వుందా … వీణ్ని విడిచి వాళ్ళ డాడీ ఒక్క క్షణం కూడా వుండలేరు … ఏదో చేసుకోలేక విసుగుపడతాను గాని … వాణ్ని చూడకుండా ఒక్క గంటైనా వుండగలనా … నేను మాత్రం …!” మాట్లాడుతూనే బబ్లూ గాడి ముద్దు మోముని గుండెల మీదకు లాక్కొని చిన్న చిన్న ఉంగరాలతో దట్టంగా వున్న వాడి బుల్లి క్రాఫ్‌లో చెయ్యి దూర్చి ప్రేమగా నిమిరింది.

లిప్త మాత్రం విశాల మనస్సు చివుక్కుమంది. అంతలోనే సహజమైన చిరునవ్వుతో – “అవునే … పిల్లల్ని వదిలి వుండడం కష్టమే … వాళ్ళూ బెంగ పెట్టుకుంటారు … పాపం…!” అని సరళంగా సర్దేసింది.

ఆ రాత్రంతా విశాలకు నిద్రలేదు. ఇంతకాలం ఉద్యోగ బాధ్యతతో – బయటి వ్యవహారాలలో గంట తీరుబడి లేకుండా గడిపిందేమో – తన బ్రతుకులో తనకే తెలీకుండా అగాధంలా ఏర్పడిన వెలితిని గ్రహించనే లేదు. ఇప్పుడిక అంతా తీరుబడే. గంటొక యుగంగా బాధించేంత విశ్రాంతి. ఇంతకాలం పట్టించుకోని లోటు నిరంతరం మరింత కృంగతీస్తోంది. విశాల ఆలోచనల్లో తమ్ముడి కుటుంబం కదిలింది. అతను మంచి ఆఫీసరు హోదాలో వున్నాడు. విద్యావంతురాలు, తెలివైనది భార్య. ఉద్యోగం చేసే అవసరం లేక పిల్లల్ని జాగ్రత్తగా మంచి క్రమశిక్షణలో పెంచుకుంటూ ఇంటి దగ్గరే వుంటోంది. వాళ్ళ సంరక్షణ బాధ్యతతోనే ఆమెకి ఇరవై నాలుగ్గంటలూ చాలవు.

“ఈ సిటీలో పెద్ద వాళ్ళు లేకుండా ఈ పరిస్థితిలో కష్టమే … పోనీ వాళ్ళని కొన్నాళ్ళు నాతో పంపరా … లత డెలివరీ అయ్యాక తెచ్చుకోవచ్చు…” అని అంటే – “నీ వల్లేమౌతుంది … ఎప్పుడైనా పిల్లల్ని పెంచావా … ఏమన్నావా … అందులో వాళ్ళమ్మ చాలా డిసిప్లిన్డ్‌గా పెంచుతుంది … వీళ్ళసలే మొండి ఘటాలు … నీకసలే లొంగరు…” అన్నాడు.



### ఇది నిజం

* నైజీరియాలో తల్లి దండ్రులే తమ కుమారునికి పెళ్ళి కూతుర్ని నిశ్చయిస్తారు. వివాహ సమయానికి తమ కుమారుడు వేరే వూరిలో పని మీద వుండి రాలేక పోతే, పెళ్ళి కొడుకు తండ్రి నిశ్చయించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు. ఆ తర్వాత కుమారుడు వచ్చి తన భార్యను తన వెంట తీసుకు వెళతాడు.

—వై. శరచ్చంద్రశేఖర్, కర్నూలు

"అవునండీ ... టీనాని ఎల్.కె.జీ.లో చేర్చాం ... చాలా జాగ్రత్తగా చదివించాలి ... మీరే అవస్థ పడలేరు ..." అంది సంస్కారవంతురాలైన లత నవ్వుతూ.

ఈసారి ఎవరో ఒకరి పిల్లను తనతో తెచ్చుకొని కొన్నాళ్ళు సరదాగా గడపాలని ఆశపడిన విశాల తన కోరికనణిచేసుకుని ఎప్పటిలాగే ఇంటికి వచ్చేసింది.

సాయంత్రం గార్డెన్‌లో కూర్చుని వుంది విశాల. ఆమె మనసు నిండా ఆలోచనలు. తగిన వ్యాపకం లేక విజృంభించి చెలరేగిపోతున్న తుది-మొదలులేని ఆలోచనలు. ఇల్లంతా నిశ్శబ్దంతో బావురుమంటోంది. ఒకప్పుడు తను ప్రశాంతంగా భావించే ఆ నిశ్శబ్దం - సందడి లేని వాకిలి ఆమె నిర్లిప్త హృదయంలా వెలితిగా వున్నాయి.

ఎదురింటి వాళ్ళ బేబీ స్కూలు బస్ దిగి వస్తోంది. తలుపులు మూసి వున్నాయి. కాంపౌండ్ గేటు తీసుకుని లోపలకు వెళ్ళి వరండాలో స్కూలు బాగ్ వుంచి - తండ్రి కోసం ఎదురు చూస్తూ నుంచుంది. అలసి, వడిలిన పసి ముఖం ఎంతో దీనంగా వుంది. ఆ పాప ముఖంలో ఆకలి-అలసట స్పష్టంగా తెలుస్తున్నాయి.

"నాన్నగారు రాలేదామ్మా ... బేబీ..." గేటు దగ్గరకు వెళ్ళి అడిగింది విశాల.

"లేదాంటీ..." వినయంగా నవ్వుతూ మృదువుగా చెప్పింది బేబీ.

"ఇలా రామ్మా ... లోపలికి ... నాతో కూర్చో..." అని ఆ పిల్లను దగ్గరకు పిలిచి - లోపలికి పోయి బిస్కట్స్, హార్లిక్స్ తెచ్చింది. బేబీకి అన్నీ వున్నాయి - తల్లి ప్రేమ తప్ప. వంట మనిషి - పని మనిషి అన్నీ అమర్చిపోతారు. తండ్రి ఉద్యోగ బాధ్యతలతో తల మునకలుగా వుంటాడు.

తినడానికి ముఖమాటపడుతున్న ఆ అమ్మాయిని మెల్లగా కబుర్లలోకి దించి బిస్కట్లు పెట్టి హార్లిక్స్ తాగించింది. అలసట తీరి - రవ్వంత సేదతీరినట్లున్న ఆ ముఖం చూస్తుంటే విశాలకెంతో తృప్తి అనిపించింది. మనసుకేదో ఉత్సాహమనిపించింది. ఆ పిల్ల కబుర్లు చెప్తుంటే సంగీతం వింటున్నట్లు తన్మయత్వంతో వింటోంది.

అంతలోనే రోడ్ మీద స్కూటర్ చప్పుడు విని ... "అరుగో ... మా డాడీ .... వచ్చేస్తున్నారు ..." అంటూ రయ్యిన పరుగెట్టింది - "థాంక్స్ ఆంటీ" అంటూనే. మబ్బులు ముసిరిన ఆకాశమే అయింది మళ్ళీ విశాల హృదయం.

"నా పిల్లలు ... నీ పిల్లలు కారటే ... అక్కా ..." ఎన్నోసార్లు చెల్లి అంటుంటే మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తుకు రాగా నవ్వుకుంది. 'పిల్లలతో తల్లి బంధం గాఢమైంది - లోతైంది, అనివార్యమైంది. నాల్గు రోజులు చుట్టం చూపుగా వెళ్ళివచ్చిన తనకే వాళ్ళని విడిచిరావడం కష్టమనిపించిందే ... మరి నవ మాసాలు మోసి - కని - కంటికి రెప్పలా పెంచుకుంటున్న తల్లికెంత కష్టంగా వుంటుంది ..?' విశాల మనసు నిండా వాళ్ళ స్మృతులే ... ముద్దు, ముద్దు మాటలు - చేష్టలు - ఆట పాటలు ... అల్లర్లు ... గాఢమైన దివ్య పరిమళంలా మనసుని అంటిపెట్టుకుని పరవశింప చేస్తున్నాయి.

"ఏమిటి ... ఆలోచిస్తున్నావు...?" అంటూ వచ్చి కూర్చున్నాడు ఆనందరావు. ఈ పలకరింపుకి విశాల ఊహాలోకం వదిలి ప్రస్తుతానికి వచ్చింది. చుట్టూ చీకట్లు ముసురుకుంటున్నాయి. మరో పనిలేక తను మరీ వెర్రిగా ఆలోచిస్తోందేమో ... వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని తప్పు చేసిందని పిస్తోంది. జీవితం ఎన్నో మెలికలు, మలుపులు తిరిగి - మరెన్నో ఒడిదుడుకుల్ని దాటుకుని ఒక స్థాయికి చేరుకుంది ఈ వయసులో తన ఆలోచనలు - తన దిగులు మరీ అపరిపక్వ మనస్తత్వాన్ని చాటుతున్నాయేమో...

గుండెల్ని చీల్చుకుంటూ వచ్చిన దీర్ఘ నిశ్వాసం పక్కనే వున్న భర్తకు వినపడకుండా లోలోపల అణచుకుంది విశాల. ఆయన కూడా ఏదో దీర్ఘాలోచనలోనే వున్నాడు. అతనికి భార్య అంతరంగం పూర్తిగా అవగతమే ఆమె ప్రతి కదలిక, ప్రతి చూపులో వున్న భావం ఇట్టే పసి కట్టేస్తాడాయన. మరి వాళ్ళిద్దరి దేహాలు వేరైనా - మనసులు, ఊహలు - ఆశలు, ఆలోచనలు ఒకటేనాయిది!

"...మోహన్‌గారి బేబీ వచ్చింది మనింటికి. పాపం ... తల్లిలేని లోటు లేకపోతే ఎంత బాగుండునో" అంది విశాల.

ఆమె చెప్పింది విని విరక్తిగా నవ్వాడు ఆనందరావు..." అవును విశాలా ... బేబీ లాంటి వాళ్ళు ఎందరో వున్నారు మన చుట్టూ ... తల్లి లేని పిల్లలూ - తండ్రిలేని పిల్లలూ - ఇద్దర్నీ కోల్పోయిన అభాగ్యులు ... అనాథలు ... ఏ ఆధారం లేని దౌర్భాగ్య జీవులు ... బేబీ ఇంకా ఎంతో అదృష్టవంతురాలు ఆమె కోల్పోయింది తల్లి ప్రేమే ... తినడానికి పిడికెడు మెతుకులూ, బతకడానికి చిగురంత ఆశాలేని నిరుపేద - అనాథ బాలలెందరో..." ఆయన మనసు విప్పి ఇంత మాట్లాడడం వింతగా, కొత్తగా చూస్తోంది. ప్రతి మాట శ్రద్ధగా వింటోంది. ఆ మాటల్లో ఏదో కొత్త ఆలోచన - మంచి ప్రణాళిక స్పష్ట స్పష్టంగా గోచరిస్తోంది.

"మన భవనంలో కొంత భాగం 'బాలభవన్'గా మార్చాలని వుంది. ఇంత మేడ మన కనవసరం కదా ... ముందు చిన్నగా ప్రారంభిద్దాం. మనమే స్వయంగా ఇద్దరు ముగ్గురు నౌకర్లతో - ఆయాలతో నిర్వహించేటట్లు ... తరువాత చూద్దాం ... ఎవరి సహకారమైనా లభిస్తుందేమో ... అది భవిష్యత్ నిర్ణయిస్తుంది ... నీ ఉద్దేశ్యం కూడా" ఆయన మధ్యలో ఆగి భార్య ముఖంలోకి పరిశీలనగా చూశాడు.

"అవునండీ ... మీ ఆలోచన ఎంతో బాగుంది మనకు మాత్రం ఎవరున్నారు - ఇదంతా అనుభవించడానికి ... ముఖ్యంగా నాకు మంచి కాలక్షేపం. తీరుబడి మరీ ఎక్కువై ... విసుగ్గా వుంటోంది ... అవునూ ... అకస్మాత్తుగా మీకీ ఆలోచన ఎలా వచ్చింది?" అంది ఉత్సాహంగా -

"...అకస్మాత్తుగా వచ్చింది కాదు విశాలా ... నీ దిగులు - బాధ - ముఖ్యంగా ఈ వయసులో నువ్వు అనుభవిస్తున్న ఒంటరితనం ... ఇవన్నీ కలిపి ..." ఆయన ఆగిపోయాడు. ఆమె ముఖంలో చాలా కాలం తరువాత సన్నని హాసరేఖ - ఆనంద వీచిక... ఆయన హృదయ భారం కూడా తీరినట్లు గుండెల నిండా ఊపిరి తీసుకున్నాడు.

●